నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
శనివారం 22 జులై 2023

కుక్కల దాడిలో మేకల మృతి


మృత్యువాత పడ్డ మేకలు

- 50 వేలు ఆస్తి నష్టం

నవతెలంగాణ-వర్ని

మండలంలోని పొట్టి గుట్ట తండా గ్రామంలో శుక్రవారం ఉదయం మేకల గుంపుపై వీధి కుక్కలు విరుచుకపడ్డాయి. తండాకు చెందిన వసంత్ అనే వ్యక్తికి చెందిన మేకల గుంపుపై దాడి చేయడంతో 15 మేకలు మృత్యువాత పడ్డాయి. సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లినట్టు బాధితుడు వాపోయాడు. జీవనోపాధి కాస్త పోయిందని, ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాలనీలను పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సంతోష్ నగర్ వడ్డెర కాలనీలను రెవెన్యూ అధికారులు శుక్రవారం పరిశీలించారు. జీవో 58, 59 ప్రకారం ఆర్మూర్ పట్టణంలో చాలా మంది పేదలు దరఖాస్తులు పెట్టుకున్నారు. సంతోష్ నగర్‌లో నివసించే పేద సిక్కులు, వడ్డెర కాలోని లో నివసించే వడ్డెర కులస్థులు జీవో 58 ప్రకారం దరఖాస్తులు చేసుకున్నారు. ఈ విషయాన్నీ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఖాందేష్ శ్రీనివాస్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినారు. తహసీల్దార్ వేణు గోపాల్ గౌడ్ , సర్వే అధికారి షికారి రాజు, రెవెన్యూ సిబ్బంది పట్టణంలోని సిక్కుల కాలనీ, వడ్డెర కాలనీల్లో దరఖాస్తుదారుల నివాస స్థితి గతులను పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ నాయకులు ఖాందేష్ సత్యం, ఎల్లయ్య, సంతోష్, నరేశ్, బాజన్న, సుధాకర్, మేతాబ్ సింగ్, హర్భజన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో నిండి పొంగిపొర్లుతున్న పోచారం ప్రాజెక్టు



పొంగుతున్న వాగులు.. దూకుతున్న అలుగులు

- వర్షాలతో చెరువులు, కుంటలకు జలకళ
- పొంగిపొర్లుతున్న పోచారం ప్రాజెక్టు.. సింగీతం గేట్లుఎత్తివేత
- ఎస్సారెస్పాకి, నిజాంసాగర్‌కు పెరిగిన వరద

నవతెలంగాణ-విలేకరులబృందం

ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు వంకలు జలకళను సంతరించుకుంటున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు పొంగిపొర్లుతుండగా.. పలు చోట్ల చెరువులు అలుగు దూకుతున్నాయి. దీంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగింది. ప్రస్తుతం 32500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుంది. ప్రాజెక్టుపూర్తి స్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1395.01 అడుగుల (6.842 టీఎంసీల) నీరు నిల్వ ఉంది. ఎస్సారెస్పీకి 59 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1090 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1073.8 అడుగుల(37 టీఎంసీల) నీరు నిల్వ ఉంది. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలున్నట్టు వాతావరణ శాఖ సూచనతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఇది వరకే కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.

కోటగిరి : పోతంగల్ గ్రామ సమీపంలోని గోదావరి ఉపనది మంజీరా , ఆయా గ్రామాలలోని చెరువులు, వాగులు, వంకలు నిండుకుండను తలపిస్తున్నాయి. కోటగిరి మండలంలో ఆరున్నర సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. పోతంగల్ మండలంలోని కొల్లూరు వాగు రహదారిపై ప్రవహించడంతో రాకపోకలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. టాక్లి, సోంపూర్ రహదారి కొంత కోతకు గురైంది, ఇప్పటివరకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు, .

పొంగిపొర్లుతున్న పోచారం

నాగిరెడ్డిపేట్(లింగంపేట్) : కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. భారీ వర్షాలతో ప్రాజెక్టులోనికి భారీగా వరద నీరు చేరి, పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకొని శుక్రవారం ఉదయం నుండి ప్రాజెక్టు పొంగిపొర్లుతుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 1464.00 అడుగులు, 1.820 టీఎంసిలు కాగా శుక్రవారం ఉదయం వరకు ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నీటితో నిండింది. పోచారం ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మంచిప్ప అడవులు, లింగంపేట్, గాంధారి, తాడ్వాయి, తదితర మండలాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా లింగంపేట పెద్దవాగు, గుండారం వాగుల ద్వారా పోచారం ప్రాజెక్టు లోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతుంది. పోచారం ప్రాజెక్టులోకి శుక్రవారం ఉదయం 3854 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, సాయంత్రానికి 5207 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతూ, అంతే మొత్తంలో ప్రాజెక్టు అలుగులపై నుండి పొంగిపొర్లుతూ మంజీరా నది ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టులోకి చేరుతుంది. కాగా ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండడంతో ప్రాజెక్టు ఆయకట్టు కింద పంటల సాగు కోసం నేడు శనివారం ఉదయం 11 గంటలకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ చేతుల మీదుగా ప్రాజెక్ట్ ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేయనున్నట్లు ఎల్లారెడ్డి నీటిపారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

కళ్యాణి ప్రాజెక్ట్ మూడు గేట్లు ఎత్తి వేత

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండలంలోని కల్యాణి ప్రాజెక్ట్ 3 గేట్ల ద్వారా శుక్రవారం అధికారులు నీటిని విడుదల చేశారు. భారీ వర్షాలకు ఎగువ ప్రాంతంలో వరద నీరు కళ్యాణి ప్రాజెక్ట్ లోకి 1200 క్యూసెక్ ల ఇన్ ఫ్లో రావడం తో మూడు గేట్లు ఎత్తి 1200 క్యూసెక్ ల నీరు దిగువ ప్రాంతానికి వదిలి మిగతా 1100 క్యుసెక్ ల నీరు నిజాంసాగర్ ప్రధాన కాలువకు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 408 మీటర్లకు గాను అదే స్థాయిలో నీరు ఉన్నట్టు తెలిపారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీరా

బోధన్ : ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో సాలూర మండల సమీపంలోని మంజీరా నది ఉధృతంగా ప్రవహిస్తుంది. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదనీరు చేరడంతో పరవళ్లు తొక్కుతుంది. పురాతన కాలం నాటి రాతివంతెన నీటమునిగగా, వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా మారడంతో రెవెన్యూ అధికారులు రాతి వంతెన పైనుండి వాహనాలు వెళ్లకుండా బ్రిడ్జికి అడ్డం గా కందకం తవ్వి మట్టికట్టవేశారు. మంజీర నదికి వరద ఉధృతి పెరగడంతో సమీప ప్రాంతాల వారుమంజీర పదిని తిలకించడానికి తరలి వెళ్తున్నారు.

పొంగుతున్న వాగులు..

ఎడతెరిపి లేని భారీ వర్షాలతో బోధన్ మండలంలోని బర్దిపూర్ వసుపువాగు, పెగడాపల్లి చెక్ డ్యాం నీటితో పొంగిపొర్లాయి. మండలంలో పలు గ్రామాల చెరువులు జలకళను సంతరించుకున్నాయి. మంధర్న, హున్సా, ఖాజాపూర్ శివారులలో వరి, సోయ పంటలు నీట మునిగాయి. సాలూర తహశీల్దార్ మమత, సర్వేయర్ శ్రావణ్ కలెక్టర్ ఆదేశాల మేరకు హున్సా గ్రామానికి చేరుకుని పురాతన మట్టి బురుజు సమీపంలో గల కుటుంబాలకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించారు.


అలుగు దూకుతున్న ఇందల్‌వాయి పెద్దచెరువు


ఎల్లారెడ్డిలోని సింగీతం ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

కందకుర్తి వద్ద పొంగిపొర్లుతున్న గోదావరి

రెంజల్ : నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం జలకళతో ఉట్టిపడుతోంది. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ భాగం నుంచి వరద ఉధృతి పెరగడంతో కందకుర్తి గోదావరి త్రివేణి సంగమంలో జలకళ సంతరించుకుంది. కందకుర్తి గోదావరి లోనున్న రాతి శివాలయం పూర్తిగా మునిగింది. గంట గంటకు వరద ఉధృతి పెరుగుతూ ఉండడంతో మత్స్యకారులు గోదావరిలోకి వెళ్లరాదని, భక్తులు సైతం గాట్ల వద్దనే స్నానాలు ఆచరించాలని, గోదావరి ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. పశువుల కాపరులు గోదావరి వైపుకు వెళ్లకూడదని సూచించారు. స్థానిక అధికారులతో పాటు పోలీసు యంత్రాంగం గోదావరి బ్రిడ్జి వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఎడపల్లి : ఎడపల్లి మండలంలో గత ఐదు రోజుల నుండి ఎడతెరిపిలేని కురుస్తున్న భారీ వర్షాలకు 60.6 వర్షపాతం నమోదైనట్లు ఎడపల్లి తహసిల్దార్ కార్యాలయ, ఏ ఎస్ఓ సతీష్ తెలిపారు.

పెద్దచెరువు అలుగు పరవళ్లు

డిచ్‌పల్లి : ఇందల్‌వాయి మండల కేంద్రంలోని ఇందల్‌వాయి గ్రామంలోని పెద్ద చెరువు అలుగు పాల పొంగుల ప్రవహిస్తూ చూపర్లను అకట్టుకుంటుంది. శుక్రవారం ఉదయం వెకువ జామున అలుగు నుండి గల నీరు శబ్దం విని తండోపతండాలుగా గ్రామస్తులు, రైతులు చేరుకుని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు అలుగు వెళ్తేనే ధర్పల్లి మండలంలోని రామడుగు ప్రాజెక్టు నిండుకుండలా నిండుతుందని, ఇదే కాకుండా ఇందల్ వాయి మండలంలోని సంస్థాన్ సిర్నపల్లి చెరువులు సైతం నిండి కాలువల ద్వారా రామడుగు ప్రాజెక్టు వరకు వరద నీరు చేరుతుందని పలువురు తెలిపారు.


నీట మునిగిన పంట పొలాలు


నీట మునిగిన పంట పొలాలు

నవతెలంగాణ-బోధన్

గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో బోధన్, సాలూర మండలంలో వందల ఎకరాలలో వరి, సోయా పంటలు నీటిమునిగాయి. దాంతో రైతులు పెట్టిన పెట్టుబడి నీటి పాలయింది. మంధర్న, హున్సా సమీప ప్రాంతాల్లో రైతులు ఎక్కువ నష్టపోయినట్లు ఆయా గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం భారీ వర్షాలతో నీట మునిగిన పంటలకు నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.





కోటగిరి : యాద్గార్‌పూర్‌లో.. సాలూరలో మంజీరా ప్రవాహానికి నీటమునిగిన రాతి వంతెన.. ఎవరూ వెళ్లకుండా కందకం తవ్వకం.. రెంజల్ : కందకుర్తి వద్ద బ్రిడ్జిని తాకేలా ప్రవహిస్తున్న గోదావరి.. నీటిలో శివాలయం

'ఆకలిరాజ్యం'

జాబ్ మేళాకు పెద్దఎత్తున తరలివచ్చిన యువత


రెజ్యూమ్‌లు ఇచ్చేందుకు పోటీ పడుతున్న నిరుద్యోగ యువత



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎడతెరిపి లేని వర్షంలోనూ నిరుద్యోగుల ఆకలి పోరాటానికి అవధులు లేకుండా పోయింది. ఉద్యోగం చేసుకుని జీవితం కొనసాగిద్దాం అని అనుకుంటే ఎటువంటి వెసులుబాటు లేకపోవడంతో ప్రైవేట్ ఉద్యోగానికైనా వెళ్లి ఉద్యోగం సంపాదిద్దామని ఉద్దేశంతో శుక్రవారం నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్‌లో నిర్వహించిన జాబ్‌మేళాకి నిరుద్యోగులు కుప్పలు తెప్పలుగా వచ్చారు. ఉద్యోగుల ఆకలి పోరాటానికి ఇదే నిదర్శనం. జిల్లాలో ఉన్న నిరుద్యోగులు ఇంజినీరింగ్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్, ఐటీకి సంబంధించిన విద్యార్థులే ఇంత పెద్ద సంఖ్యలో ఉంటే, మిగతా ఉద్యోగాలకు, నిరుద్యోగులు ఏ పాటిన ఉద్యోగం కోసం పోరాడుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

జాబ్ మేళాలో 750 ఉద్యోగులకు 10 వెలకు పైగా నిరుద్యోగులు హాజరైనారు. దీంతో నిరుద్యోగుల సమస్య ఎంతగా ఉందో ఈ జాబ్ మేళాతో అర్థం అవుతుంది. అక్కడ కన్వెన్షన్ హాల్‌లో ఇంటర్నెట్ కనెక్షన్ లేదు, ఒక వేపు ఇంటర్వ్యూ అంటూ రెస్యూములు ఇలా లాగేసుకున్నారు. మళ్ళీ ఇంటర్వ్యూ లు పెడతాము అని కొందరికి తెలియజేశారు. ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుందని మరికొందరికి సూచించారు. ఎలా ముందుకు వెళ్ళాలో ఏ ఒక్క క్లారిటీ లేకుండా పోయింది అని నిరుద్యోగుల ఆరోపణ చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సమగ్రాభివృద్ధి

బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పిన మంత్రి వేముల

నవతెలంగాణ-వేల్పూర్/

కేసిఆర్ జనరంజక పాలన, బాల్కొండ నియోజకవర్గంలో జరుగుతున్న అబివృద్ధికి ఆకర్షితులై బీజేపీ,కాంగ్రెస్ ల నుంచి పలువురు యూత్ సభ్యులు సుమారు 100 మంది బీఆర్ఎస్‌లో చేరినట్టు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వేల్పూర్ మండలం పడగల్ గ్రామంలో యాల్ల మహిపాల్ అధ్వర్యంలో కాంగ్రెస్ పలువురు యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పడగల్ సర్పంచ్ రాజ్ కుమార్, ఎంపిటిసి శ్యామ్ రావు, పిపిసిఎస్ చైర్మన్ హన్మంతు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మెండోర మండలం సావెల్ గ్రామం నుంచి ఎంపిటిసి రాజేశ్వర్ అధ్వర్యంలో ఎస్టీ సంఘం లీడర్ సంతకాల తిరుపతి, ఢీ3 యూత్ సభ్యులు,పెర్ఫెక్ట్ యూత్ సభ్యులు,ఆర్ ఆర్ యూత్ సభ్యులు సుమారు 60 మంది యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు.

ఛీ.. గలీజ్

- మురుగుమయంగా నవీపేట్ సంత ప్రాంగణం
- రోడ్డుపైనే కూరగాయల విక్రయాలు


పూర్తిగా బురదమయంగా మారి మురికికూపంగా తయారైన సంత ప్రాంగణం



నవతెలంగాణ-నవీపేట్

నవీపేట్ మండల కేంద్రంలోని సంత ప్రాంగణం మురుగు మయమైంది. కూరగాయలు కొనేందుకు వెళ్లిన మహిళలు ఛీ గలీజ్ అంటూ ముఖం చాటేస్తున్నారు. మండల కేంద్రంలో శుక్రవారం సంత కావడంతో వందల సంఖ్యలో సంతకు కూరగాయలు కొనుగోలు చేసేందుకు వస్తుంటారు. ముఖ్యంగా మహిళలు వర్షాకాలం కావడం సంతలోని మురుగుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 15 రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో ఉండడంతో సంతలో మురుగు విపరీతంగా పెరిగిపోయింది. దీంతో కూరగాయల విక్రయదారులు మురుగులో దుకాణాలు వేసేందుకు సౌకర్యంగా లేకపోవడంతో చివరకు ప్రధాన రహదారిపై కూరగాయల విక్రయాలు చేశారు. దీంతో ప్రయాణికులకు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాబట్టి ఇప్పటికైనా గతంలో ఇచ్చిన హామీ మేరకు సంత ప్రాంగణం సరి చేసి సంతకు వచ్చే క్రయవిక్రయదారులకు సౌకర్యంగా ఉండే విధంగా చూడాలని కోరుతున్నారు.

జాబ్‌మేళాకు స్పందన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్త

- సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డ యువత

నవతెలంగాణ-మోపాల్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రారంభం కానున్న ఐటీ హబ్ కోసం శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్థానిక భూమారెడ్డి కన్వెన్షన్ హాల్లో జాబ్ మేళా ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ కవిత నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా, ఎన్ఆర్ఐ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. యువత అంచనాల కంటే మించి వచ్చారు. హబ్‌లో ఆయా కంపెనీలలో పనిచేయడానికి ముందే ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేశారు. దీనిపై అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బాజిరెడ్డి జగన్, ప్రత్యేక చొరవ చూపించారు.

జాబ్ మేళాకు వచ్చి జాబు రాని నిరుద్యోగులు నిరుత్సాహ పడవద్దని ఐటీ హబ్ మరిన్ని కంపెనీలు వస్తాయని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఒకప్పుడు ఐటీ ఉద్యోగాలు అంటే బెంగళూరు హైదరాబాదు మాత్రమే అనేవారని కానీ కెసిఆర్ ప్రభుత్వం వచ్చాక ద్వితీయ శ్రేణి నగరాలకు కూడా విస్తరించారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విఠల్‌రావు, మేయర్ నీతు కిరణ్, దుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి తదితర నాయకులు మరి పెద్ద మొత్తంలో యువత పాల్గొన్నారు.

స్పష్టత కరువు

సుమారు 10,000 మంది జాబ్ మేళా కోసం వచ్చినట్టు సమాచారం. 12 కంపెనీలు వచ్చాయి. కానీ ఏ కంపెనీ ఎంతమందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నా మని సరైన స్పష్టత ఇవ్వలేదు. ఎక్కువ సంఖ్యలో నిరుద్యోగులు తరలిరావడంతో వారికి తగ్గట్టు సౌకర్యాలు కల్పించలేరని పలువురు బాహటంగా విమర్శిం చారు. యువతీ, యువకులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయకపోగా, రెజ్యూమ్‌లు ఇచ్చేందుకు గుంపులుగా నిలబడటంతో చిన్నపాటిగా తోపులాట చోటుచేసుకుంది. దీంతో చాలా మంది నిరుద్యోగులు కనీసం రెజ్యూమ్ కూడా ఇవ్వలేక తిరిగి వెళ్లిపోయారు. అన్ని డిగ్రీలు చేసిన వారికి అవకాశం ఉన్నట్టు చెప్పినా.. కేవలం ఇంజినీరింగ్ చేసిన వారి ఉద్యోగ అవకాశాలున్నట్టు పలు కంపెనీలు పేర్కొనడంతో పలువురు పెదవి విరిచారు.


మాట్లాడుతున్న కవిత

వచ్చే నెలలో డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ

ప్రారంభ ఏర్పాట్లపై తహసీల్దార్‌లతో మంత్రి వేముల సమీక్ష


సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి వేముల

నవతెలంగాణ-వేల్పూర్

బాల్కొండ నియోజకవర్గంలో నిర్మాణం పూర్తి అయిన డబుల్ బెడ్రూం ఇండ్లు వచ్చే నెలలో అర్హులైన లబ్దిదారులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేయాలని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బాల్కొండ నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో నిర్మాణం పూర్తి అయిన,చివరి దశలో ఉన్న,పురోగతిలో ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలపై శుక్రవారం ఆర్డీవో, అన్ని మండలాల తహసిల్దార్లతో వేల్పూర్‌లో శుక్రవారం మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. నిర్మాణం పూర్తి అయిన, పురోగతిలో ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్ల వివరాలు మండలాల వారిగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పైరవీలకు ఆస్కారం లేకుండా లబ్దిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరగాలని స్పష్టం చేశారు. సమీక్షలో ఆర్డీవో వినోద్ కుమార్, తహశీల్దార్లు, ఆర్ అండ్ బి ఎ.ఈ నర్సయ్య,మంత్రి ఓఎస్డి విజేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కోటపాటి నర్సింహనాయుడు,బద్దం ప్రవీణ్ రెడ్డి, రాజాగౌడ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు పాత్ర కీలకం

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు


ఈవీఎం యంత్రం పనితీరు పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజా స్వామ్య పరిరక్షణలో ఓటరు పాత్ర ఎంతో కీలకమైనందున అర్హులైన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. త్వరలో జరుగనున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అర్హులైన ఓటర్లు అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. ఓటింగ్ ఆవశ్యకతను వివరిస్తూ, పోలింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు జిల్లాలో శాసనసభా నియోజకవర్గాల వారీగా సంచార రథాల (మొబైల్ వాహనాల) ద్వారా గ్రామగ్రామాన ప్రచారం చేయిస్తున్నామని అన్నారు. ఒక్కో నియోజకవర్గం పరిధిలో రెండు సంచార రథాల చొప్పున, బాన్సువాడ సెగ్మెంట్ సహా జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలో మొత్తం 12 వాహనాల ద్వారా అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు.

డిచ్‌పల్లి : రూరల్ నియోజకవర్గానికి కేటాయించిన రెండు మొబైల్ ఈవిఎం డెమోన్‌స్ట్రేషన్ వాహనాలు శుక్రవారం డిచ్ పల్లి తహసిల్దార్ కార్యాలయానికి చేరుకున్నాయని తాహసిల్దార్ శ్రీనివాస్ రావు తెలిపారు. నియోజక వర్గంలోనీ (7) మండల పరిధిలోని అన్ని పోలింగ్ బూత్ లో (3) నెలల పాటు ప్రదర్శనలు నిర్వహిస్తమని తెలిపారు.

డిప్యూటీ డిఎంహెచ్వోకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ రాష్ట్ర అనస్థీషియా వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సీనియర్ అనస్థీషియా వైద్యులు డిప్యూటీ డిఎంహెచ్వో జె.రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా శుక్రవారం అభినందన, సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్ మాట్లాడుతూ.. డాక్టర్ రమేష్ ఎప్పుడు పేదలకు వైద్యం అందించడంలో ముందున్నారని, కరోన సమయంలో కూడా తన సేవలను అందించారని చెప్పారు. ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతి వైద్య సేవలు అందించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఉత్తమ వైద్యునిగా అవార్డు తీసుకోవడం అభినదనియం రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా మరిన్ని సేవలు అందించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ రుద్ర శ్రీనివాస్,సబ్ యూనిట్ అధికారి సిహెచ్.ఓ కృష్ణ మూర్తి, ఆంద్రోస్, సంపత్, నరేందర్, శ్రీనివాస్, శేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని సన్మానించిన పైడి రాకేష్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్



బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన పార్లమెంట్ సభ్యులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్ర కార్యాలయం నాంపల్లిలో పట్టణ నియోజకవర్గ నాయకులు పైడి రాకేష్ రెడ్డి శుక్రవారం, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు అరవింద్ ,పల్లె గంగారెడ్డి తదితరులతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మణిపూర్ ఘటనకు ప్రధానమంత్రి బాధ్యత వహించాలి

- దోషులను 24గంటల్లో శిక్షించాలి
- మణిపూర్ సీఎం రాజీనామా చేయాలి : ఐద్వా
- ప్రధాని నరేంద్ర మోడీ బాధ్యత వహించి రాజీనామా చేయాలి : మహిళా కాంగ్రెస్
- మహిళాసంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో నిరసనలు దిష్టిబొమ్మల దహనం

మణిపూర్‌లో కుకీ, నాగ గిరిజన మహిళలపై సామూహిక అత్యాచారం జరిపి వారిని నగ్నంగా ఊరేగించి ముగ్గురు మహిళలను హత్య చేసిన కిరాతకం అనాగరికతకు బిజెపి ప్రధానమంత్రి మోడీ, హెూం మంత్రి అమీత్ షాలే బాధ్యత వహించాలని పలు మహిళాసంఘాలు, పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం దిష్టిబొమ్మల దహనం, నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

నవతెలంగాణ-విలేకరులు

సిరికొండ:మండల కేంద్రంలో సీపీఐఎంఎల్ ప్రజాపందా, ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్బంగా సిపిఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు పి రామకృష్ణ మాట్లాడుతూ.... బిజెపి పథకం ప్రకారమే మెజారిటీ మెయితీ వారిని రెచ్చగొట్టి అల్లర్లకు పూనుకున్నదని, కిరాతకాలను చేస్తున్నదని, ఇది బీజేపీ ఎజెండాలో భాగమేనని ఆయన దుయ్యబట్టారు. గిరిజన మహిళలను వివస్త్రలను చేసి రెండు కిలోమీటర్ల మేర నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేసి, హత్య చేయడం దారుణమన్నారు. ఈ దారుణం సోషల్ మీడియాలో వైరల్ అయినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఈ ఘటనకు పాల్పడిన వారిని, బాధ్యులైన వారిని శిక్షించాల్సింది పోయి సోషల్ మీడియా లపై చర్య తీసుకుంటానని అనడం సిగ్గుచేటని అన్నారు. పిఓడబ్ల్యు జిల్లా ఉపాధ్యక్షురాలు పి రమ మాట్లాడుతూ... భారత మాతను నడి వీధుల్లో ఊరేగించడం బిజెపి, హిందూ పాసిజానికి నిదర్శనం కాదా.. అని ప్రశ్నించారు. గిరిజన గ్రామాలపై వేలాదిగా మూక దాడులకు అక్కడి ప్రభుత్వమే ప్రోత్సహించి మహిళల మాన, ప్రాణాలను బలితీసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు రమేష్,ఈ రమేష్, ఎం సాయరెడ్డి, మండల నాయకులు బి కిషోర్, అఫ్రోజ్, ఎం సుశీల, నాగన్న, సంజీవ్ పాల్గొన్నారు.

ఆర్మూర్ :మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లు, గిరిజనులపై జరిగిన హత్యాచారాలు, మహిళల నగ్న ఊరేగింపు ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి మోడీ, ముఖ్యమంత్రి భీరేన్ సింగ్ రాజీనామా చేయాలని సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా రాష్ట్ర నాయకులు వి ప్రభాకర్ డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా కార్యాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి నరేంద్ర మోడీ మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వి ప్రభాకర్, జిల్లా నాయకులు బి దేవారం ఎం. ముత్తెన్న లు మాట్లాడుతూ.. మణిపూర్లో కుకి,నాగా, గిరిజనులు,మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని మెజారిటీ మైతి తెగ కేంద్ర, రాష్ట్ర ప్రజల అండతో అమానుష దమనకాండ కొనసాగిస్తుందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలోని భీరేన్‌సింగ్ బిజెపి డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు గుజరాత్ మోడల్ విధ్వంసకాండ అమలు చేస్తున్నారని తెలిపారు. అక్కడ ఇప్పటికీ 120 మంది కుకీ గిరిజనులు హతులయ్యారని, 60 వేల మంది నిరాశ్రయులయ్యారని అన్నారు. వందలాది మహిళలు అత్యాచారాలకు గురి అయ్యారని తెలిపారు. మే 4న 2000 మంది మైటీ తెగ హిందువులు కుకీ తెగకు చెందిన గ్రామంపై దాడి చేసి గృహ దహనాలకు పాల్పడ్డారని, దొరికిన వారిని చంపేశారని, పొలాల నుండి పారిపోతున్న ముగ్గురు మహిళలను అడ్డుకోబోయిన బాలిక తండ్రిని చంపివేశారని అన్నారు. అక్కని రక్షించడానికి పోయిన తమ్ముడిని సైతం వదలకుండా దుండగులు హత్య చేశారని తెలిపారు. పోలీసులు వచ్చి దుండగులకు మహిళలను అప్పగించడం భారత జాతి తలదించుకునే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించి పొలాలల్లోకి తీసుకెళ్లి సామూహిక హత్యాచారం చేసి వీడియో తీశారని, అడ్డుకోబోయిన బాలిక తండ్రిని చంపివేశారని తెలిపారు. ఇది మే 4న జరిగితే పోలీసులు కేసు పెట్టలేదని, సుప్రీంకోర్టు కేసును సుమోటోగా స్వీకరించి స్పందించే వరకు నరేంద్ర మోడీ ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని వారు అన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజాపంతా సబ్ డివిజన్ కార్యదర్శి బి కిషన్ నాయకులు శేఖర్, గంగన్న, సత్యక్క ,నరేందర్, పద్మక్క ,అనిల్, నిఖిల్ రవి ,శ్రీనివాస్ ,లింబాద్రి, మనోజ్, గంగాధర్ సాయికుమార్ ,మమత ,అక్షయ ,సంగీత, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్:మణిపూర్ మహిళలకు రక్షణ కల్పించి దుండగులను వెంటనే శిక్షించాలని ఎస్ఎఫ్ఐ, జీఎస్ఎస్సి నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) గర్ల్స్ కన్వినింగ్ కమిటీ ఆధ్వర్యంలో మణిపూర్ ఘటనలోని దుండగులను కఠినంగా శిక్షించాలని దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా జీఎస్ఎస్సి కో-కన్వీనర్ దీపిక మాట్లాడుతూ మణిపూర్లో మహిళలను నగ్నంగా ఊరేగించడం దేశానికే అవమానకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి మోడీ మణిపూర్ ఘటనలో పెదవి విప్పకపోవడం విచారకరమని అన్నారు. మణిపూర్ ముఖ్యమంత్రి బీరన్ సింగ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీ మాట్లాడకపోవడంలో అంతర్యం ఏమిటని వాపోయారు. సేవ్ మణిపూర్ - సేవ్ గర్ల్స్ అనే నినాదంతో నిరసన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించి మహిళలకు రక్షణ కల్పించాలని లేకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమాలు నిర్మిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కలిసి గర్ల్స్ కన్వేనింగ్ కమిటీ సభ్యులు నీలిమ, మేఘన, సాధియ, షరీన్, లక్ష్మి,ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విఘ్నేష్, అనిల్, నగర కార్యదర్శి మహేష్, సురేష్,



కంఠేశ్వర్: దుండగుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ, జీఎస్ఎస్సీ నాయకులు

నాయకులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్:మణిపూర్ ఘటనపై మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని ఐద్వానాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించి లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో నిజామాబాద్ జిల్లాకేంద్రంలో శుక్రవారం నిరసన తెలిపారు. గాంధీచౌక్‌నుండి బస్టాండ్‌వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్‌వద్ద కండ్లకు నల్లరిబ్బన్ కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్బంగా ఐద్వా నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత హత్యలు, హత్యాచారాలు, దాడులు, లైంగిక వేధింపులు హద్దు అదుపు లేకుండా పెరిగిపోతున్నాయని అన్నారు. ఈ సంఘటనలు ఇకపై జరగకుండా ఉండాలంటే మహిళలు చైతన్యవంతులై పోరాటాలలో భాగస్వాములు కావాలని తెలిపారు. అన్ని తరగతుల మహిళలు ఆందోళనా కార్యక్రమాలు చేస్తే తప్ప ప్రభుత్వాలు మహిళల రక్షణపై దృష్టి పెట్టలేవన్నారు. రానున్న కాలంలో మహిళలు ఆడపిల్లలు సురక్షితంగా ఉండాలి అంటే పోరాటాలు చేస్తే తప్ప మార్పులు వచ్చే పరిస్థితి కనపడటం లేదని తెలిపారు. మణిపూర్ నిందితులకు 24 గంటల్లో శిక్ష పడకపోతే బిజెపి భవనాలను దేశవ్యాప్తంగా ముట్టడిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఏ అనిత జిల్లా నాయకులు కే లావణ్ నాయకులు కళావతి పుష్ప సుబ్బలక్ష్మి లలిత లక్ష్మీ రేఖ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ :ముగ్గురు గిరిజన మహిళల బాధిత కుటుంబాలను ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా నగర కార్యదర్శి ఎం.సుధాకర్ అన్నారు. నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. మణిపూర్ రాష్ట్రంలో కుకీ తెగకు చెందిన ముగ్గురు గిరిజన మహిళలను వివస్త్రను చేసి, అమానుషంగా హింసిస్తూ, నగ్నంగా ఊరేగించి, సామూహిక హత్యాచారం చేసి, ఇద్దరిని హత్య చేసిన ఘటన పట్ల ప్రపంచమే దిగ్భ్రాంతికి గురైందన్నారు. ఈఘటనలో హత్య అత్యాచారం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బాధిత మహిళల కుటుంబాలకు 50 లక్షల రూపాయలు చొప్పున ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, అల్లర్లలో ప్రాణాలు, ఆస్తులు కోల్పోయిన బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి, భద్రత కల్పించాలన్నారు. మోడీ తక్షణమే మణిపూర్ రాష్ట్రంలో పర్యటించాలని, రాష్ట్రంలో శాంతిభద్రతలు నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.గోదావరి, కే.సంధ్యారాణి, పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు విటల్, కిరణ్, నాయకులు మహిపాల్, లక్ష్మీకాంత్, లలిత, గంగాధర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్: మహిళలను నగ్నంగా ఊరేగించి హత్య చేసిన ఘటనకు ప్రధాని నరేంద్ర మోడీ బాధ్యత వహించి పదవికి రాజీనామా చేయాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీరడి భాగ్య డిమాండ్ చేశారు. నిజామాబాద్ నగరలో నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమానికి నీరడి భాగ్య, ఎన్.ఎస్.యు.ఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు వరదబాటు వేణురాజ్ మాట్లాడారు. ముందుగా వారు జిల్లా కాంగ్రెస్ భవన్ నుండి రైల్వే స్టేషన్ వద్ద గల శివాజీ విగ్రహం వరకు నరేంద్ర మోడీకి బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వచ్చారు. కుకీ మహిళల ఉదంతం వెలుగులోకి వచ్చిన ఘటన మాత్రమే అని, వెలుగులోకి రాని ఘటనలు ఇంకా ఎన్నో ఉన్నాయని అన్నారు. 2002లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నరేంద్ర మోడీ చేయించిన అల్లర్లలో దాదాపు 2000 మంది ఊచకోతకు గురయ్యారని ఎంతోమంది మహిళలు అత్యాచారాలకు గురయ్యారని, నిండు గర్భిణిగా ఉన్న మహిళను అత్యాచారం చేసిన నిందితులను అరెస్టు చేసి జైల్లో ఉంచితే మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత వారిని విడిపించి సన్మానాలు చేసి ఊరేగించారని ఆమె గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ గాజుల సుజాత ,రాష్ట్ర కార్యదర్శి పద్మ ,మలైకా బేగం, జిల్లా ప్రధాన కార్యదర్శి సరోజ , మహిళా కాంగ్రెస్ నాయకులు, ఎన్.ఎస్.యు.ఐ నాయకులు అష్రఫ్, సాయి పాల్గొన్నారు.



కండ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు, మహిళలు



సిరికొండ :ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



కంఠేశ్వర్: ర్యాలీగా వస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోర్తాడ్ ఎస్ఐగా అనిల్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-మోర్తాడ్



మోర్తాడ్ నూతన ఎస్సైగా అనిల్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్సై ముత్యంరాజ్ ఆదిలాబాద్ బదిలీ కాగా వర్ని నుండి మోర్తాడ్‌కు బదిలీపై అనిల్ రెడ్డి వచ్చారు. ప్రజలందరూ శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు. బదిలీపై వెళ్లిన ఎస్సైని ఘనంగా సన్మానిస్తూ నూతన ఎస్సై కి స్వాగతం పలికారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన ఇంటర్నేషనల్ కరాటే బ్రూస్‌లీ అవార్డు గ్రహీత

నవతెలంగాణ-కంఠేశ్వర్



అభినందిస్తున్న ఎమ్మెల్సీ కవిత

నిజామాబాద్ జిల్లా పర్యటనకు విచ్చేసిన ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత ను ఇంటర్నేషనల్ కరాటే బ్రూస్లీ అవార్డు గ్రహీత, నిజామాబాద్ జిల్లా కరాటే అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎడ్ల వెంకటేష్ మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కరాటే లో గ్లోబల్ వరల్డ్ రికార్డ్ గోల్డ్ మెడల్స్ సాధించిన ఎడ్ల సిరి చందన, ఎడ్ల రిత్విక్‌తో ఆప్యాయంగా మాట్లాడి అభినందించారు. ఇంత చిన్న వయసులో కఠిన తరమైన కరాటే విద్యలో బంగారు పతకాలు సాధించడం జిల్లాకు గర్వకారణమని, తాను చాలా సంతోషంగా ఫీల్ అవుతున్నానని తెలిపారు. ఎడ్ల సిరి చందన, ఎడ్ల రిత్విక్ వీరిద్దరూ సొంత అక్క తమ్ముళ్లు అవడం గమనార్హం. భవిష్యత్ లో ప్రపంచ స్థాయిలో మరిన్ని బంగారు పతకాలు సాధించి తెలంగాణ రాష్ట్ర కీర్తిని నలుమూలల చాటుతామని, అందుకు ఎమ్మెల్సీ ఆశీర్వాదం సపోర్ట్ కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బినోలా సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాండ్లు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

బీఆర్ఎస్ రూరల్ ఎస్సీ కన్వీనర్‌గా పాశం కుమార్



నియామకపత్రం అందజేస్తున్న బాజిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ కన్వీనర్‌గా ఇందల్ వాయి మాజీ సర్పంచ్, తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ నాయకులు పాశం కుమార్‌కు ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నియమించినట్లు ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్ తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ఉద్యక్షులు బీరిష్ శెట్టి,రాజు నాయక్, అంబర్ సింగ్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా
పాశం కుమార్..

ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ రూరల్ తనను ఎస్సీ కన్వీనర్‌గా నియమించడం గొప్ప విషయమని, బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వచ్చే ఎన్నికల్లో రూరల్ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయాన్ని బాజిరెడ్డి గోవర్ధన్‌కు కానుకగా ఇస్తామని పాశం కుమార్ తెలిపారు. బాజిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏర్గట్ల ఎస్సైగా మచ్చేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఏర్గట్ల



ఎస్సై గా మచ్చెందర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఏర్గట్ల పోలీస్ స్టేషన్‌లో సంవత్సరంన్నరపాటు ఎస్సైగా విధులు నిర్వహించిన రాజు బదిలీపై మామడ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణలో ముందుంటానని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని తెలిపారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహకం

నవతెలంగాణ-ఏర్గట్ల

ఉపాధిహామీలో జాబ్ కార్డు కలిగిఉండి 5 ఎకరాల లోపు గల షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, చిన్న సన్నకారు రైతులు పండ్ల తోటల పెంపకానికి రాయితీ పొందడానికి ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిఓ శివ చరణ్, హార్టికల్చర్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీ సమీప గ్రామపంచాయతీలో గాని, ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద గాని, ఎంపీడీఓ ఆఫీస్‌లోగాని సంప్రదించి, పండ్ల తోటల పెంపకానికి ఇందులో రైతు ఎన్నుకున్న పండ్ల తోటలను పండించవచ్చని తెలిపారు.

కులసంఘాలకు ప్రొసీడింగ్ కాపీలు అందజేత



ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న మంత్రి

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని ఏర్గట్ల,తడపాకల్, తొర్తి గ్రామాలలో పలు సంఘాల అదనపు గదుల నిర్మాణం కోసం మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శుక్రవారం ఆయా సంఘాల వారికి ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఏర్గట్ల మండలకేంద్రంలోని నెరేళ్ళ గురడి సంఘానికి 5 లక్షలు, జక్కని ముదిరాజ్ సంఘానికి 4 లక్షలు, జంగల ముదిరాజ్ సంఘానికి 5 లక్షలు, తడపాకల్ లోని మాదిగ సంఘ భవనానికి 3 లక్షల 50 వేలు, మున్నూరు కాపు సంఘానికి 4 లక్షలు, కుమ్మరి సంఘానికి 4 లక్షలు, తొర్తి వెంకటేశ్వర స్వామి ఆలయం నుండి రాజరాజేశ్వర ఆలయం వెనుక వరకు డ్రైనేజీ నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూర్ణానందం, ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, ఎంపీటీసీ జక్కని మధుసూదన్, సర్పంచులు కుండ నవీన్, పత్తిరెడ్డి ప్రకాష్, ఉపసర్పంచులు తాహెర్, లోలం అశోక్, గ్రామశాఖ అధ్యక్షులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్, వేశాల నర్సారెడ్డి, ఏర్గట్ల పిఏసీఎస్ చైర్మన్ బర్మ చిన్న నర్సయ్య,వైస్ చైర్మన్ సిగసారం గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణం బైపాస్ రోడ్డు పక్కన బ్రిడ్జ్ నిర్మాణ పనులు సాగుతున్న తీరు కాంగ్రెస్ నాయకుడు కోల వెంకటేష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ కాలయాపన అధికారుల నిర్లక్ష్యంవల్ల ఆర్మూర్ నుండి నందిపేట్‌కు వెళ్లే దారిలో బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన జరుగుతున్నాయని అన్నారు. రాక రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని, బ్రిడ్జి నిర్మాణం రెండు మూడు నెలలుగా సాగిస్తున్నా పూర్తి కాలేదని తెలిపారు. వర్షాల కారణంగా టెంపర్ వారి రోడ్డు మొత్తం బురద, గుంతలు మయంగా మారిందని, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఎక్కువగా వర్షాలు కురిస్తే ఆ తాత్కాలిక మట్టి రోడ్డు కూడ కొట్టుకు పోయేలా ఉందన్నారు. నీళ్లు ఇంకా ఎక్కువ ప్రవహిస్తే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురవుతారని వాహనదారులు, ప్రజలు అంటున్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన మాయావార్ రాజేశ్వర్

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్‌జిల్లా నూతన ఆదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన యాదిరెడ్డిని నిజామాబాద్ జిల్లా వినియోగ దారుల సమాచార కేంద్రం చైర్మన్ మాయ వార్ రాజేశ్వర్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్ప గుచ్చం అందజేసి సన్మానించారు.

సీఎం దిష్టి బొమ్మ దహనం

నవతెలంగాణ-భీమ్‌గల్/ముప్కాల్

బాట సింగారంలో డబుల్ బెడ్ రూమ్‌ల పరిశీలనకు వెళుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్ రావును అరెస్ట్ చేయడాన్ని బీజేపీ నాయకులు ఖండించారు. బీజేపీ లీడర్ల అరెస్టులకు నిరసనగా శుక్రవారం భీమ్‌గల్ మండల అధ్యక్షులు మూలిగే మహిపాల్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో అధికార పార్టీ వైఖరిని ఖండించారు. శాంతియుతంగా ప్రశ్నించే వారిని అడ్డుకుంటున్న ప్రభుత్వ వైఖరి సరికాదన్నారు. కార్యక్రమం లో బీజేపీ నాయకులు లక్ష్మణ్ గౌడ్, చిన్ని నర్సయ్య, కనికరం మధు, ప్రవీణ్, సంధ్య రాజు, యోగేశ్వర్ నర్సయ్య, లక్ష్మీ నారాయణ, నవీన్, హకీం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్:కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం బీజేపీ నాయకులు మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. 'ఛలో బాట సింగారం' పోలీసులు భగ్నం చేయడం పట్ల నిరసన చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు గిరిస్వామి, ముస్కు నర్సయ్య, గడ్డం సంతోష్ రెడ్డి, చిల్క దినేష్, మెడికల్ విక్రమ్, నర్సయ్య, సాగర్, మజిత్, గైని సాయన్న, భూమేశ్వర్, ప్రశాంత్, రమేష్, కిషన్, రాము పాల్గొన్నారు.

వెయ్యి రూపాయలు అందేలా చూడాలి

- విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి జిల్లా అధ్యక్షులు గోపు శ్రీకాంత్

నవతెలంగాణ-ముప్కాల్



రాష్ట్రంలో దివ్యాంగులకు ఆసరా పింఛన్ రూ.3,016 రూపాయలకు అదనంగా మరో వెయ్యి రూపాయలను పెంచుతూ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం మేరకు అందించాలని వికలాంగుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు గోపు శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ జులై నెల నుంచైనా రూ.4,016 అందించాలని కోరారు. కార్యక్రమంలో విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు గోపు శ్రీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్ప రాధ, మండల ప్రెసిడెంట్ శ్రీరామ్ సాగర్, సుఖిదాస్, కుంటా గంగారెడ్డి, మోతే దేవేందర్ పాల్గొన్నారు.

వివక్షను వీడి జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-మోపాల్ /కమ్మర్‌పల్లి/ఆర్మూర్

వివక్షను వీడి గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమ్మెలో భాగంగా 16వ రోజు మండల కేంద్రంలో ధర్నాలో పాల్గొని మాట్లాడారు. నిరక్షరాస్యులు, దళితులైన గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె చేస్తుంటే పేదలను ఉద్ధరిస్తామని చెప్పే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలకు అనుగుణంగా వేతనాలు నిర్ణయించకుండా తామే వేతనాలు చెల్లిస్తున్నట్టు మంత్రులు ప్రకటించటం పూర్తిగా అర్థరహితమని అన్నారు. కర్ణాటక రాష్ట్రంలో 16 వేల రూపాయలు చెల్లిస్తున్నారని, అనేక రాష్ట్రాల్లో ఎక్కువ వేతనాలు ఇస్తున్నారని అన్నారు. తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని తెలిపారు. వెంటనే గ్రామపంచాయతీ కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్మికులను బెదిరించటం మానుకోవాలని సమస్య పరిష్కరించ డానికి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన అన్నారు. లేకుంటే రాబోయే కాలంలో అత్యవసర సేవలను కూడా నిలిపివేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని, దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ మోపాల్ మండల అధ్యక్షులు ధర్మానంద్, మండల నాయకులు శ్రీనివాస్, పోశెట్టి, గంగాధర్, ప్రదీప్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు. అంతకు ముందు తమ సమస్యల పరిష్కరించాలని నినాదాలు చేశారు.



మోపాల్ : మాట్లాడుతున్న రమేష్‌బాబు

కమ్మర్‌పల్లి:ప్రభుత్వం గతంలో తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకూ విధులకు హాజరు కాబోమని పేర్కొంటూ మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయతీ సిబ్బంది శనివారం సర్పంచ్ సక్కారం అశోక్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉపసర్పంచ్ కస్తూరి విక్రమ్ లకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ శనివారం నుండి గ్రామ పంచాయతీ విధులకు రావడం, గ్రామంలో పారిశుధ్య, ఇతరత్రా పనులు చేయడం జరగదని స్పష్టం చేశారు. మండల కేంద్రంలో నిర్వహించనున్న నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కరోబార్ మోత్కుటూరి రమేష్, వాటర్ మెన్ తుపారపు శ్రీధర్, ఎలక్ట్రీషన్ పాండు, ట్రాక్టర్ డ్రైవర్ మోతే ముత్తెన్న, అటెండర్ సోప్పరి శ్రీధర్, పారిశుద్ధ కార్మికులు నల్ల ముత్తు, పతాని భూదేవి, మైస శారద, పతాని పూల, దొన్ పాల లింగయ్య, పాలకొండ నరసయ్య, ఈదుల్లా పోషన్న పాల్గొన్నారు.

ఆర్మూర్ :సఫాయికార్మికులే నిజమైన దేవుళ్లంటూ సలాం కొట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సఫాయి కార్మికులు 16 రోజులుగా సమ్మె కనిపించడం లేదా అని ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు సూర్య శివాజీ, సిఐటియూ మండల కార్యదర్శి కూతాడి యెల్లయ్య లు ప్రశ్నించారు పట్టణ ఎంపిడిఓ శ్రీనివాస్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 11వ పి ఆర్ సి, జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ గతంలో ఇచ్చిన మాట ప్రకారం పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని వారు కోరారు. జీవో నెంబర్ 51 మల్టీ పర్పస్ విధానాన్ని రద్దుచేయాలన్నారు. కార్మికులందరికీ ప్రమాద బీమా 10 లక్షలు కట్టాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు, సిఐటియూ నాయకులు గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జేఏసీ నాయకులు లక్ష్మయ్య, మచ్చర్ల, భాఘవ, గంగారం, ఐనార్ల పుష్ప, ఇస్సపల్లి గంగామణి, రాంపూర్ నల్ల గంగు నల్లన్న, పోసాని తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-తాడ్వాయి

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, ఎస్ఐ ప్రసాద్ వివరాల ప్రకారం.. దేవునిపల్లి గ్రామానికి చెందిన దేవల చాకలి నారాయణ(60) 21వ తేదీన కామారెడ్డిలో పాలు పోసి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో ఉదయం 9.15 గంటలకు దేవునిపల్లి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వెనకాల నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు అతి వేగంగా వచ్చి ఢీకొనడంతో చాకలి నారాయణ కాలు పూర్తిగా విరిగిపోయింది. నారాయణ తమ్ముడు దేవల చాకలి శంకర్‌కు ఫోన్ ద్వారా సమాచారం రావడంతొ వెంటనే అక్కడికి చేరుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. నారాయణ తమ్ముడు శంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బురదలో సంత



నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే వారంతపు సంత శుక్రవారం బురదలో కొనసాగింది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల వలన సంత స్థలం బురద మయంగా మారింది. దీంతో వ్యాపారస్తులు బురదలో ఇబ్బందులు పడుతూ సంత నిర్వహించవలసి వచ్చింది.

గూడు చెదిరింది..



మద్నూర్ : తెగిపోయిన రోడ్డు

పలు గ్రామాల్లో వర్షానికి కూలిపోయిన ఇండ్లు.. కొట్టుకుపోయిన రోడ్లు



మతుసంగెంలో కూలిన ఇల్లు



సదాశివనగర్ : అడ్లూర్ ఎల్లారెడ్డిలో..



భిక్కనూర్ : కూలిన బేకరి దుకాణం

నవతెలంగాణ-విలేకరుల బృందం

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి నివాసపు ఇండ్లు కూలిపోయాయి. దీంతో బాధితులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కూలిపోయిన ఇండ్లను ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. అలాగే కొన్ని చోట్ల వర్షపు నీటి ప్రవాహానికి రోడ్లు కొట్టుకుపోయాయి.

మతుసంగెంలో కూలిన రెండు ఇండ్లు..

గాంధారి : మండలంలోని మతుసంగెం గ్రామంలో గత ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామంలో రెండు ఇండ్లు కూలిపోయాయి. గ్రామానికి చెందిన పద్మశాలి భూమయ్య, గ్రామానికి చెందిన మరో వ్యక్తి ఇల్లు కూలిపోయింది. కూలిన ఇండ్లను సర్పంచ్ కమ్మరి భాస్కర్ సందర్శించారు.

కూలిన ఇంటిపై కప్పు..

సదాశివనగర్ : సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామం లో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మంగళి శోభ అనే మహిళా ఇల్లు గురువారం రాత్రి కురిసిన వర్షానికి కుప్పకూలింది. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి ప్రభుత్వం తమ కుటుంబం ను ఆదుకోవాలని శోభ వేడుకుంది.

వర్షానికి కూలిన బేకరీ దుకాణం..

భిక్కనూర్ : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ అజార్, పట్టణంలో బేకరీ నడుపుతూ తన కుటుంబాన్ని పోషించు కుంటున్నారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బేకరీ నడుపుతున్న ఇల్లు కూలి పోగా, ఇంట్లో ఉన్న బేకరీ వస్తువులు ధ్వంసమయ్యాయి. సుమారు మూడు లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.

కూలిన ఇండ్లను పరిశీలించిన ప్రజాప్రతినిధులు..

మండలంలోని కాచాపూర్ గ్రామంలో వర్షాలకు కూలిపోయిన పలు ఇండ్లను మాజీ ఎంపీపీ సుదర్శన్, సర్పంచ్ సులోచన సుదర్శన్, మాజీ ఎంపీపీ సుదర్శన్, ప్రజాప్రతినిధులు పరిశీలించి ఇండ్లు కోల్పోయిన బాధితులను స్థానిక పాఠశాలలో ఉండాలని సూచించారు. వారికి కావలసిన నిత్యావసర సరుకులు అందజేశారు. వార్డు సభ్యులు మురళి, మాజీ సర్పంచ్ భూపతి, సచివాలయ కార్యదర్శి మౌనిక, కారోబార్ తిరుమలరావు ఉన్నారు.

వర్షాలకు కూలిన ఇండ్లు..

లింగంపేట్ : గత మూడు రోజులకు కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలో శుక్రవారం నాటికి 9 ఇండ్లు కూలిపోయినట్టు తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్ తెలిపారు. లింగంపేట్, శెట్పల్లి సంగారెడ్డి, మోతే, పోతాయిపల్లి, భవానీపేట్, ఐలాపూర్ గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లో 9 ఇండ్లు ఇప్పటివరకు కూలిపోయాయన్నారు.

కొట్టుకుపోయిన రోడ్లు..

మద్నూర్ : గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మద్నూర్ మండలంలో పలుచోట్ల రోడ్లు కొట్టుకుపోయాయి. మండలంలోని లింబూర్-చిన్నటాక్లి మధ్య ఇటీవల నిర్మించిన బ్రిడ్జి సరిపోకపోవడం, దానిపక్కనుంచి బ్రిడ్జిపై నుంచి వరదనీరు పారుతోంది. అదేవిధంగా శక్కర్గ గ్రామ శివారు రహదారికి నిర్మించిన బ్రిడ్జ్ పక్కన గల రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది.

కొట్టుకుపోయిన కల్వర్టు రోడ్డు..

జుక్కల్ : మండలంలోని లాడేగాం గ్రామ సమీప గ్రామానికి వెళ్లే రోడ్డు మధ్యలో చేపడుతున్న కల్వర్టు వద్ద రోడ్డు వర్షం దాటికి కొట్టుకుపోయింది. అటు వైపు పొలం పనులకు వెళ్లే రైతులకు కాలినడకన పోయేందుకు వీలులేకుండా పోయింది. నాలుగు రోజులుగా పడుతున్న వర్షానికి లాడేగాం వాగు రోడ్డు ధ్వంసమయ్యింది.

దరఖాస్తుల ఆహ్వానం



నవతెలంగాణ-తాడ్వాయి

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద సంచార చేపల వాహనాలు, మూడు చక్రాల వాహనాలు, ఐస్ బాక్సులు సబ్సిడీపై మంజూరు చేసేందుకు గానూ అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మత్స్య శాఖ అధికారి వరదారెడ్డి శుక్రవారం తెలిపారు. దరఖాస్తులో వాహనం మోడల్, కంపెనీ తెలియజేస్తూ ముందస్తుగా దరఖాస్తు చేసుకున్న వారికి మొదటి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. కేటగిరీల ప్రకారం అనుమతి పొందిన యూనిట్లు మాత్రమే ఉంటాయని పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లాలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సభ్యులు ఆసక్తి, అర్హత గల వారందరూ జిల్లా మత్స్యశాఖ అధికారి, కామారెడ్డి కార్యాలయంలో సంబంధిత పత్రాలతో పాటు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ పథకం చేపల రవాణా, చేపలతో తయారు చేయబడే ఆహార ఉత్పత్తులను విక్రయిస్తూ జీవనోపాధి పొందే వారికోసం ప్రవేశపెట్టినట్టు వివరించారు. ఇందులో ఎస్.టి, ఎస్.సి. మహిళలకు 60 శాతం సబ్సిడీ, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఉందని, ఈ అవకాశాన్ని అర్హతగల వారందరూ ఉపయోగించుకోవాలని కోరారు.

శెట్పల్లిలో ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం



ఆధార్ కేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని శెట్పల్లి గ్రామంలో తపాలా శాఖ ఆధ్వర్యంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించినట్టు సర్పంచ్ పద్మ గంగారెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తపాల సిబ్బంది మహబూబ్‌రెడ్డి, తపాలా శాఖ అధికారి అంబర్‌సింగ్, బీపీఎంలు లింగం, నితీన్‌రెడ్డి, వినోద్, రోషన్, మారుతి, రమ్య, మంజుల, మనిషా, వర్షగౌస్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అట్టెం శీను గ్రామస్తుల తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి స్టడీ మెటీరియల్ అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని పోసానిపేట గ్రామ మినీ గ్రంథాలయానికి జిల్లా గ్రంథాలయం నుంచి గ్రంథాలయ చైర్మన్ పున్న రాజేశ్వర్ శుక్రవారం స్టడీ మెటీరియల్, గోడ గడియారాన్ని స్థానిక ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా దశరథ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగాల కోసం తయారవుతున్న యువతకు చదువుకోవడానికి అందుబాటులో పుస్తకాలు ఉండాలని ఆలోచనతో, గ్రంథాలయ చైర్మన్ రాజేశ్వర్‌ను కోరగా వెంటనే స్పందించి, స్టడీ మెటీరియల్, గోడ గడియారం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ అధికారులకు సహకరించిన చైర్మన్

నవతెలంగాణ-వర్ని

గత నాలుగు రోజుల పాటు కురస్తున్న ఈదురుగాలులతో కూడిన వర్షానికి చందూర్ మండల కేంద్రంలో చెట్టు విరిగి విద్యుత్తు తీగలపై పడటంతో గ్రామంలో విద్యుత్ అధికారులు చెట్టు కొమ్మలను నరికి వేయటానికి ప్రయత్నం చేయగా.. పీఏసీఎస్ చైర్మన్ ప్యారం అశోక్ వారికి సహకరించారు. చెట్టు కొమ్మలను తొలగించారు. సహకరించిన చైర్మన్‌కు విద్యుత్ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల పరిశుభ్రతపైన దృష్టి సారించండి

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని ముప్పై గ్రామ పంచాయతీల్లో పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో నరేష్, ఎంపీవో యాదగిరి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల పంచాయతీ జూనియర్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలపైన ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేపీఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పెంపకంపై ఆసక్తి చూపాలి

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామీణ ఉపాధి హార్టికల్చర్ ద్వారా పండ్ల మొక్కల పెంపకంపై రైతుల ఆసక్తి చూపాలని మండల అభివృద్ధి అధికారి మల్లికార్జున్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో హార్టికల్చర్ ద్వారా ప్రభుత్వం 5 ఎకరాలలోపు భూమి ఉన్న సన్న చిన్న కారు రైతులకు సబ్సిడీపై పండ్ల మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. ఎస్సీ ఎస్టీలకు 100 శాతం సబ్సిడీ, బీసీలకు 90శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. హార్టికల్చర్ ద్వారా మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ సీతాఫల్, నారింజ, మునగ, కొబ్బరి, డ్రాగన్‌ఫుడ్, ఆపిల్, సపోటా, కొబ్బరి, ఆయిల్‌ఫామ్‌తో పాటు వివిధ రకాల మొక్కలు పెంచడానికి రైతులు ముందుకు రావాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న రైతులకు ఇది వర్తిస్తుందని ఆయన సూచించారు. పండ్ల మొక్కల పెంపకం ద్వారా రైతులకు అదనంగా లాభం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రభాకర్ చారి, ఏపీవో తులసీరాం, పంచాయతీ కార్యదర్శులు ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కనీస సౌకర్యాల్లేవ్

- జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి



నవతెలంగాణ-రామారెడ్డి

విద్యుత్ సబ్ స్టేషన్లలో కనీస సౌకర్యాలు కూడా లేవని, సిబ్బందికి సరైన సమయానికి వేతనాలు కూడా ఇవ్వటం లేదని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండలంలోని పోసానిపేట్, రామారెడ్డి విద్యుత్ సబ్‌స్టేషన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎక్కడ కూడా 24 గంటల విద్యుత్ సరఫరా చేయటం లేదని, 12 గంటల విద్యుత్ మాత్రమే సరఫరా చేయగా, రేవంత్‌రెడ్డి దెబ్బతో, 18 నుంచి 20 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నారని, సబ్ స్టేషన్‌లో లాకు బుక్కులే సాక్షమని అన్నారు. విద్యుత్ సబ్ స్టేషన్‌లో సిబ్బందికి కనీస సౌకర్యాలు లేవని, సబ్ స్టేషన్ గేటును కూడా మరమ్మతు చేయలేని ప్రభుత్వం, గ్లౌజులు, బూట్లు కూడా సరఫరా చేయకపోవడం, ట్రిప్పు బెల్ లేకపోవడంతో సబ్‌స్టేషన్‌లో సిబ్బందికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సరిపడా సిబ్బందిని కూడా కేటాయించకపోవడంతో, గ్రామాల్లో పని చేసే విద్యుత్ సిబ్బంది, సబ్ స్టేషన్‌లో డ్యూటీలు చేయడం ఏంటని ప్రశ్నించారు. గ్రామాల్లో పనిచేసే విద్యుత్ సిబ్బంది లేక, ప్రైవేట్ వారిని ఆశ్రయించి, మరమ్మతులు చేయించుకోవడంతో రైతుల జేబులకు చిల్లు పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోసానిపేట సర్పంచ్ గిరిరెడ్డి మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- సూచించిన ప్రజాప్రతినిధులు, పోలీసులు

నవతెలంగాణ-బోధన్‌టౌన్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి అన్నారు. శుక్రవారం పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌తో పర్యటించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శరత్‌రెడ్డి, వినోద్, హబీబ్‌ఖాన్, నాయకులు సమీర్, అధికారులు డిప్యూటీ ఈఈ శివానందం, ఎస్ఐ శంకర్ పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై ఉదయ్ కుమార్

రెంజల్ : గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కందకుర్తి గోదావరితో పాటు, వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయని, లోతట్టు ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఉదయకుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆయన అన్నారు.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై విజయ్ కొండ

పిట్లం : గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై విజయ్ కొండ శుక్రవారం సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇంట్లోనే అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితులలో మాత్రమే బయటకు వెళ్లాలని సూచించారు. ఆయా గ్రామాలలోని వాగులు, చెరువుల వద్దకు వెళ్ళకూడదని అన్నారు. అలాగే విద్యుత్ స్తంభాలను, వైర్లను తాకవద్దని, వాహనాలపై ప్రయాణం చేయు సమయంలో నీటిమయమైన రోడ్లపై గుంతలు తెలియక పదాలు సంభవించే ప్రమాదమున్నందున జాగ్రత్తగా ప్రయాణం చేయాలని ఆయన సూచించారు.

16వ రోజుకు జీపీ కార్మికుల సమ్మె



ఎడపల్లిలో జీపీ కార్మికుల భిక్షాటన

నవతెలంగాణ-విలేకరుల బృందం

గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలుచోట్ల జీపీ కార్మికులు వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేశారు.

తాడ్వాయి : గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలిపారు. వీరికి ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. గ్రామ పంచాయతీ సంఘం మండల అధ్యక్షులు శివానందం గౌడ్ మాట్లాడుతూ తమను రెగ్యులరైజ్ చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి బాపురావ్, కోశాధికారి రంగుల గంగారాం, సహాయ కార్యదర్శి పుల్లూరి స్వామి, సలహాదారు సంజీవులు, శ్రీనివాస్, కుమ్మరి అంజయ్య, దేమె శరవంగ్ రావ్, చిన్న సాయిలు తదితరులు పాల్గొన్నారు.

దప్పుచప్పుల్లతో భిక్షాటన..

ఎడపల్లి : మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ధర్నాచౌక్ వద్ద తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగింది. ఇందులో భాగంగా జీపీ కిర్మికులు డప్పు చప్పులతో ప్రభుత్వ కార్యాలయంలోని అధికారుల వద్ద, ఎడపల్లిలోని ప్రధాన వీధులలో గల చిరు వ్యాపారుల వద్ద భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ జంగం గంగాధర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎడపల్లి జేఏసీ మండల కన్వీనర్ గంగరాజు, కోకన్వీనర్లు పాండు, కుంట సంతోష్, బిల్ కలెక్టర్ యూనియన్ ఎడపల్లి మండల అధ్యక్షులు రాజు, పద్మావతి రహిమత్, వెంకగౌడ్, గుణ తేజ, లక్ష్మణ్, జీపీ సిబ్బంది కరిగింట్ల శ్రీనివాస్ స్వామి, పద్మ సాయమ్మ సాయిలు, గంగాధర్ స్వామి పాల్గొన్నారు.

భిక్కనూర్ : గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పంచాయతీ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు యాదగిరి తెలిపారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు మాట్లాడారు. కార్యక్రమంలో పలు గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

భారీవర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే షకీల్ ఆమెర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోధన్

గత నాలుగు రోజులకు కురుస్తున్నా భారీ వర్షాల వలన జనం ఇబ్బందులు పడకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి పరిస్థితులపై సమీక్షించాలని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ అన్నారు. శుక్రవారం ఆయన బోధన్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ అధికారులకు సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నందున ఆర్డీవో, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలని ఎప్పటికప్పుడు పరిస్థితులపై చర్యలు చేపట్టాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు వారి సొంత గ్రామాలలో ప్రజలకు వర్షాల పట్ల ఇబ్బందులు పడకుండా అవగాహన కల్పించాలని సూచించారు. బోధన్ పట్టణంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, కమిషనర్ వార్డులలో పర్యటించి పరిస్థితులను తెలుసుకోవాలన్నారు. పిల్లలు విద్యుత్ స్తంభాలకు ముట్టుకోకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాల కారణంగా పురాతన ఇండ్లు కూలితే ప్రమాదం జరగకుండా ప్రజలను అవగాహన కల్పించాలని, నివాస ఇండ్ల కూలిపోయిన వారికి తక్షణమే గృహలక్ష్మి పథకం ద్వారా ఇండ్లు మంజూరి చేస్తామన్నారు. సోమవారం నుంచి బీసీలకు రూ.లక్ష ఆర్థికసాయం నియోజకవర్గానికి 300ల మంది లబ్దిదారులకు మంజూరు చేస్తామన్నారు. దళిత బంధు పథకం కోసం దళితులు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, వాటిని కలెక్టర్ ఆధ్వర్యంలో పరిశీలించి మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్ నాయకులు విద్యాసాగర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు నరసయ్య నాయకులు చంద్రయ్య తదితరులున్నారు.

పంటల సాగుపై యూఎస్ కన్సల్టెన్సీ బృందం అధ్యయనం



ముఖాముఖి నిర్వహిస్తున్న యూఎస్ కన్సల్టెన్సీ బృందం

నవతెలంగాణ-భిక్కనూర్

పంటల సాగు, అధిక దిగుబడిపై యూఎస్ కన్సల్టెన్సీ బృందం మండల కేంద్రంలో గల రైతు వేదికలో పంటల సాగుపై శుక్రవారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూఎస్ కన్సల్టెన్సీ బృందం సభ్యులు పంటల వివరాలు దిగుబడి అంశాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలను టీం సభ్యులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ గాల్‌రెడ్డి మాట్లాడుతూ పంట మార్పిడితో అధిక దిగుబడి వస్తుందని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, వ్యవసాయ శాఖ ఏడీఏ అపర్ణ, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, మండల వ్యవసాయ అధికారి రాధ, సొసైటీ చైర్మన్ భూమయ్య, సొసైటీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మల్లేశం, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని తిమ్మారెడ్డి గ్రామంలో అధికారులు ప్రజలకు ఈవీఎం, వీవీ పాట్‌లపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఓటు వేసే ప్రతి ఒక్కరూ ఈవీఎం, వీవీ పాట్‌లపై అవగహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదులో పొరపాట్లుండొద్దు

- బీఎల్ఓలకు అవగాహనా సదస్సు



రెంజల్ : మాట్లాడుతున్న అధికారి

నవతెలంగాణ-రెంజల్/ఎల్లారెడ్డి

ఓటరు నమోదు చేసే క్రమంలో ఎలాంటి పొరపాట్లు చేయొద్దని అధికారులు సూచించారు. ఓటరు నమోదుపై బీఎల్ఓలకు అవగాహనా సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంటీలు గోపాలకృష్ణ, శశిభూషణ్, సుభాష్ చంద్రబోస్ మాట్లాడారు. 18 సంవత్సరాలు పైబడిన వారందరి పేర్లను ఓటర్ జాబితాలో చేర్చుకోవాలని వారికి సూచించారు.

వివాహం చేసుకొని కొత్తగా వచ్చిన వారి వివరాలను సేకరించి వారికి సైతం ఓటర్ నమోదు కార్యక్రమంలో భాగస్వా ములు చేయాలని వారు అన్నారు. ఓటర్ జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీ ల్దార్ రామచందర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, వీఆర్ఏలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం బీఎల్ఓలతో అధికారులు ఓటరు జాబితాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రెండవ ఎస్ఎస్ఆర్ 2023లో భాగంగా ఓటరు జాబితా తయారుపై బీఎల్ఓలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నియోజకవర్గ స్థాయి శిక్షకుడు కె.రాజేశ్వర్ శిక్షణనిచ్చారు. మండలానికి చెందిన 44మంది బీఎల్ఓలు, నలుగురు సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి

నవతెలంగాణ-బోధన్‌టౌన్

మణిపూర్ రాష్ట్రంలో జరిగిన దారుణ ఘటనకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలంటూ బోధన్ పట్టణంలో సీపీఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ ప్రజాపంథా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్ మాట్లాడుతూ.. మణిపూర్ రాష్ట్రంలో పట్టపగలే కుకి తెగకు చెందిన మహిళలను నగ్నంగా ఊరేగించి, సామూహిక లైంగికదాడికి పాల్పడి వారిలో ఇద్దరిని హతమార్చి రెండున్నర నెలలు గడిచిన అ ఘటనపై ఎలాంటి విచారణ, చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఈ ఘటనకు కేంద్ర ప్రభుత్వం, ప్రధా ని మోడీ, హోంమంత్రి అమిత్‌షా, ఆ రాష్ట్ర ముఖ్య మంత్రి బాధ్యత వహించాలని, ఈ ఘటనలను సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బోధన్ మండల కార్యదర్శి పడాల శంకర్, ఐఎఫ్‌టీయూ నాయకులు ధ్యాకం పోశెట్టి, ఏఐకేఎంఎస్ నాయకులు ఎస్.బాలయ్య, ఎస్.శంకర్, జి.సాయిలు, ఎస్కే.వాయిద్, శ్రీధర్, సాయిలు, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వం వెంటనే రాజీనామా చేయాలి..

మహిళలను వివస్త్రను చేసి లైంగికదాడికి ఒడిగట్టినా.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చలనం లేని విధంగా ప్రవర్తించడం సరైనది కాదని బోధన్ కాంగ్రెస్ యూత్ నాయకులు మండిపడ్డారు. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం తెల్ల కాగితంపై మోడీ చిత్రపటాన్ని గీసి మోడీ డౌన్ డౌన్ అంటూ రాసిన కాగితాన్ని దహనం చేశారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-తాడ్వాయి

ఉపాధిహామీలో భాగంగా పండ్ల తోటల పెంపకం కోసం అర్హులైన అభ్యర్థులు ఈనెల 31వ తేదీ వరకు రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ రాజ్‌వీర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి కల వారు దరఖాస్తు ఫారాన్ని మండల ఉపాధిహామీ ఆఫీస్ నందు సమర్పించాలని పేర్కొన్నారు. రైతులు ఎవరైనా ముందుకు వస్తే వారి నుంచి భూమి పట్టాపాసుబుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, జాబ్ కార్డ్ జిరాక్స్ పత్రాలు తీసుకొని మండల ఉపాధి హామీ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించాలి

నవతెలంగాణ-బోధన్ టౌన్

బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లో గల నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెలంగాణ ప్రభుత్వం వెంటనే తెరిపించి ప్రభుత్వ పరం చేసి, 2015 సంవత్సరం నుంచి కార్మికులకు రావాల్సిన బకాయిలను చెల్లించి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని న్యాయవాది అడ్లూరి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం నిజాంషుగర్ ఫ్యాక్టరీ గేటు ముందు ఆయన మాట్లాడారు. అనారోగ్య కారణాలతో చనిపోయిన కార్మిక కుటుంబాలను ఆదుకుని, కబ్జాలకు గురవుతున్న నిజాంషుగర్స్ భూములను రక్షించాలని డిమాండ్ చేశారు. మిస్డ్ కాల్ ఉద్యమాన్ని ప్రారంభించారు. కావున 8447369369 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి మద్దతు తెలపాలని బోధన్ నియోజక వర్గ ప్రజలను కోరారు.

వర్షాలు పూర్తిగా తగ్గేవరకూ మందులు పిచికారీ చేయొద్దు

- మండల వ్యవసాయాధికారి నరేష్

నవతెలంగాణ-గాంధారి

వర్షాలు పూర్తిగా తగ్గేవరకూ పంటకు మందులు పిచికారీ చేయవద్దని మండల వ్యవసాయాధికారి నరేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని నెరల్ గ్రామంలోని పంటపొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరుసగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలలో నీరు నిల్వ ఉండే అవకాశం ఉందని, ఇంకా రెండు మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని, కావున పంట పొలాలలో నిల్వ ఉన్న నీరు ఎప్పటికప్పుడు వెంటనే బయటకు వెళ్ళేవిధంగా కాల్వలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎరువులు వేసే వారు కానీ, పురుగు, తెగులు మందులు పిచికారీ కానీపూర్తిగా వర్షాలు తగ్గే వరకూ చెయ్యకూడదని రైతులు సూచించారు.

విద్యార్థికి ఆర్థిక సహాయం



ఆర్థికసాయం అందజేస్తున్న లయన్స్ సభ్యులు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రానికి చెందిన మార్గల వైష్ణవి పాలిటెక్నిక్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ.45వేల ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు క్లబ్ జిల్లా చైర్మన్ సంజీవరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్మూర్ క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ ఈసీఈ మూడవ సంవత్సరం చదువుతున్న పిట్లంకు చెందిన మర్గల వైష్ణవికి ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందున ఆమెను అభినందించి క్లబ్ తరపున హాస్టల్ ఫీజు కొరకు రూ.45 వేల చెక్కును అందజేశామన్నారు. పాలిటెక్నిక్ అనంతరం ఉన్నత విద్య కొరకు క్లబ్ తరపున ఆర్థిక సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కిషన్ సభ్యులు వేణుగోపాల్, రజిని, లక్ష్మీనారాయణ, రాజుసేట్, బెజ్జం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-రెంజల్


ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణలో భాగంగా తలపెట్టిన ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో ఆగస్టు 2వ వారంలో నిర్వహించే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని జిల్లా కో ఇన్చార్జ్ శనిగరపు మురళీకృష్ణ కోరారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు సాటాపూర్, నీలా, కళ్యాపూర్ గ్రామాలలో నిర్వహించిన సమావేశాలలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణలో భాగంగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో రాజీలేని ఉద్యమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ భాగంగా తలపెట్టిన విశ్వరూప మహాసభను విజయవంతం చేయడానికి, ఎస్సీలతోపాటు ఎస్సీ ఉపకులాలు అత్యధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి లక్ష్మీగారి భూమయ్య, ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకులు బండారి పోశెట్టి, గుర్రాల పోశెట్టి, కిన్నెర మోహన్, గుర్రాల మారుతి, నరేష్, గంగాధర్, శివ, నాగరాజ్, ప్రసాద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జానకంపేట్ ఆరోగ్య కేంద్రం సందర్శన

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట్ ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఎడపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కంటి వెలుగు ఇన్చార్జి వైద్యాధికారి రాజ్‌కుమార్ సందర్శించారు. కేంద్రంలో ఏఎన్ఎంలో ఆశావర్కర్లకు, ఎంఎల్‌హెచ్‌పీకి ఇతర సిబ్బందికి ఇంద్రధనస్సులో 0.5 సంవత్సరంలోపు, (డ్రాప్ అవుట్), సర్వే నిర్వహించి పిల్లలను గుర్తించి మళ్లీ వారికి టీకాలు తప్పనిసరిగా వేయాలని వైద్య సిబ్బందిని సూచించారు. టీకాలు తీసుకోవడం వలన పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని ఆయన గుర్తు చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇంటి పరిసర ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల పరిసరాలను ఇంటి యజమానులు శుభ్రంగా ఉంచుకునేందుకు వారికి అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎడపల్లి ఆసుపత్రి పాలనాధికారి రాములు, పర్యవేక్షణకురాలు దేవమ్మ, ఏఎన్ఎం సరిత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బోధన్ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన రాజాగౌడ్



నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవోగా రాజాగౌడ్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. బోధన్ తహసీల్దార్ వరప్రసాద్, ఆర్ఐ వరుణ్, ప్రభాకర్, సిబ్బంది ఆయనకు సాదర స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు రెవెన్యూ పరంగా ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కాగా రాజాగౌడ్ బాన్సువాడ ఆర్డీవోగా పనిచేసి తాజాగా జరిగిన బదిలీల్లో బోధన్‌కు బదిలీపై వచ్చారు.

బోధన్ పట్టణంలో పారిశుధ్య పనులు

నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్ పట్టణంలో పారిశుధ్యంపై మున్సిపల్ యంత్రంగా ప్రత్యేక శ్రద్ధ వహించింది. ఇందులో భాగంగా శుక్రవారం మున్సిపల్ సిబ్బంది పట్టణంలోని 35వ వార్డులో పిచ్చి మొక్కలను తొలగించి, డ్రయినేజీలను శుభ్రం చేశారు. దోమల నివారణ మందులను పిచికారీ చేశారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని మరిన్ని మెరుగైన పనులు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

హెల్త్ సబ్ సెంటర్ మంజూరు

నవతెలంగాణ-వేల్పూర్

వేల్పూరులో హెల్త్ సబ్ సెంటర్ నూతన భవనం కోసం 20 లక్షల రూపాయలు మంజూరు చేసిన మంత్రి ప్రశాంత్‌కు వేల్పూరు గ్రామ ప్రజల తరపున, గ్రామ పంచాయతీ, గ్రామ అభివృద్ధి కమిటీ , వైద్య సిబ్బంది, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ మీనా, వేల్పూరు సర్పంచ్ తీగల రాధ మోహన్, ఉప సర్పంచ్ పిట్ల సత్యం , యం.పి.టి.సి మొండి మహేష్, జిల్లా ఆర్‌టీఏ మెంబర్ రేగుల్ల రాములు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బబ్బురు ప్రతాప్ రెడ్డి , బీమా రాజేందర్, సామ మహిపాల్ , వి. డి.సి అధ్యక్షులు కమలేస్, సభ్యులు మెడిధ పల్లి రమేశ్ , సిస్టర్ రాధిక , నాగమణి పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లను విధుల్లోకి తీసుకోవాలి

- పీడీఎస్‌యూ
- కలెక్టరేట్ ఎదుట నిరసన, వినతి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కాలేజీల్లో తొలగించిన గెస్ట్ లెక్చరర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నిజామాబాద్ కలెక్టరేట్‌వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ యాదిరెడ్డికి పీడీఎస్‌యూ, పివైఎల్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.గౌతమ్ కుమార్, జన్నారపు రాజేశ్వర్, పివైఎల్ జిల్లా అధ్యక్షులు వనమాల సత్యం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 405 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1654 మంది గెస్ట్ లెక్చరర్స్‌గా పనిచేస్తున్నారని అన్నారు. వీరు త్రీమెన్ కమిటీ ద్వారా నియమించబడ్డారని, వీరంతా నిబంధనల ప్రకారం పీజీలో మెరిట్ ఉండి, ఇంటర్వ్యూని ఎదుర్కొని, డెమో ఇచ్చి సెలెక్ట్ అయిన వారని, 10 సంవత్సరాలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న లక్షలాదిమంది పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతున్నారని అన్నారు. నేటికీ వారికి ఉద్యోగ భద్రత లేదని, రెగ్యులర్ లెక్చరర్‌లతో పాటుగా పనిచేస్తున్న అరకొరగా జీతాలు ఇస్తున్నారని తెలిపారు. పండగలు, హాలిడేస్ వస్తే ఆ మాత్రం జీతం రాక నష్టపోతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో ఇటీవలే గెస్ట్ లెక్చరర్స్ అందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తామని, వారి వేతనాన్ని పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు. దీనిని అమలు చేయాలని, జీవో నెంబర్ 1145 ప్రకారం గెస్ట్ లెక్చరర్స్ అందర్నీ కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు మనోజ్, భాస్కర్, దేవిక, నిఖిల్, ఆకాష్, కత్తుల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ డిపో ప్రారంభానికి సన్నాహాలు

- పరిశీలించిన డిపో మేనేజర్, నాయకులు

నవతెలంగాణ-భీమ్‌గల్


డిపోను పరిశీలిస్తున్న అధికారులు

భీమ్‌గల్ ఆర్టీసీ బస్ డిపోను పున్నప్రారంభం చేసేందుకు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆదేశాలతో అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. శుక్రవారం ఆర్టీసీ ఆర్మూర్ డిపో మేనేజర్ కవితతో పాటు ఇతర అధికారులు డిపోను పరిశీలించారు. డిపోను తెరిపించేందుకు కావలసిన మౌలికవసతులు అంచనా వేయాలని స్థానిక నాయకులకు ఆదేశించారు. నాయకులు ఇచ్చిన నివేదిక ప్రకారం డిపోను ప్రారంభం చేసేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. డిపోను ఆర్మూర్ డిపో మేనేజర్ కవిత, లీడర్లు కన్నె సురేందర్, గుర్విర్ రెడ్డి, మల్లెల లక్ష్మణ్, రజాక్, లింగం, భగత్, బోదిరే నర్సయ్య, రజాక్, ప్రసాద్, మూత లింబాద్రి, దశగౌడ్, తదితరులు పరిశీలించారు. డిపోలో పేరుకు పోయిన చెత్తను తొలగించి, చదును చేయించారు. పిచ్చి మొక్కలు జేసీబీల సహాయంతో తొలగించారు. బస్సులు నిలిపేందుకు అనువుగా తయారు చేశారు. విరిగి పోయిన గేట్ లకు మరమ్మతులు చేస్తున్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి డిపోను మంత్రి వేముల చేతుల మీదుగా పున్న ప్రారంభం చేయడం జరుగుతుందని నాయకులు, అధికారులు తెలిపారు.

చెరుకు రైతులకు అండగా నిలవాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధరప్ప

నవతెలంగాణ-బోధన్‌టౌన్


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చెరుకు రైతులకు అండగా నిలవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధరప్ప కోరారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లోని చెరుకు అభివృద్ధి కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరుకుకు రూ.5వేలు మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పెంచిన మద్దతు ధర రైతులకు సరిపోవడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్టిన పెట్టుబడికి స్వామినాథన్ కమిటీ సిఫారసు అమలు చేసి పెట్టుబడిని రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జె.శంకర్‌గౌడ్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు అధ్యక్షుడు ఏశాల గంగాధర్, తెలంగాణ కార్మిక సంఘం కార్యదర్శి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డీఎంఅండ్‌హెచ్‌వో లక్ష్మణ్‌సింగ్


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్

నవతెలంగాణ-సదాశివనగర్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో మురికి నీరు లేకుండా చూడాలని అన్నారు. అనంతరం ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ అస్మా అఫ్షిన్, సి.యచ్.ఓ నాగరాజు, సూపర్‌వైజర్ నక్షత్ర, ఏఎన్ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బంగారు తెలంగాణలో కంగారు రోడ్లు

- బీజేపీ

నవతెలంగాణ-ఆర్మూర్



తెలంగాణను బంగారు తెలంగాణ చేస్తామని చెప్పిన కేసీఆర్, పట్టణంలో అభివృద్ధిని పరిగెత్తిస్తామని చెప్పిన ఎమ్మెల్యే ఇద్దరూ దొందు దొందేనని బిజెపి పట్టణశాఖ నాయకులు అన్నారు. శుక్రవారం వారు పట్టణంలోని రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ కన్వీనర్ పాలెపురాజు, బిజెపి పట్టణ అధ్యక్షులు జెస్సు కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణను బంగారు తెలంగాణగా మారుస్తానని చెప్పి తెలంగాణను అవినీతి, అక్రమాల, భూకబ్జాల, అణిచివేతల, ఆత్మహత్యల తెలంగాణగా మార్చారని కేసీఆర్‌ను ఆదర్శంగా తీసుకున్న ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి అభివృద్ధికి పడకేశారని విమర్శించారు. చిన్నపాటి వర్షాలకే ఆర్మూర్ పట్టణంలోని రోడ్లన్నీ చిత్తడి–చిత్తడిగా మారి నడవలేని దుస్థితి, వాహనాలు రోడ్లు మీదికి తేవాలంటేనే జంకుతున్నారని అన్నారు. వెంటనే రోడ్లను బాగుపరచాలని ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతకు హితవు పలికారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు పల్లె శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మందుల బాలు, పట్టణ కార్యదర్శులు పులి యుగంధర్, గుగులోత్ తిరుపతి నాయక్, గిరిజన మోర్చా పట్టణ అధ్యక్షులు కేలోత్ పీర్‌సింగ్, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి ఉదయ్ గౌడ్, దళిత మోర్చ పట్టణ ప్రధాన కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ ఆర్టీసీ డిపో డీఎంగా శ్రీనివాస్ బాధ్యతలు

నవతెలంగాణ-బోధన్‌టౌన్


బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎం

బోధన్ ఆర్టీసీ డిపో డీఎంగా ఎం.శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. బదిలీ అయిన స్వామి ఆయనకు బాధ్యతలను అప్పగించారు. బోధన్ డిపో కార్మికులు బదిలీపై వెళ్తున్న డీఎం స్వామికి వీడ్కోలు పలికారు. గజమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంది

- 2022-23 అకాడమీ ఎక్సెన్స్ అవార్డులు ప్రదానం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



అవార్డులు అందుకున్న విద్యార్థులు

ఇంటర్ పూర్తి అయ్యిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు అన్నారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టివియువి) ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 2022–23 అకాడమీ ఎక్సెన్స్ అవార్డులు ప్రదానం చేశారు. నిజామాబాద్‌నగరంలోని ఖలీల్‌వాడీలోగల న్యూ అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం ఎక్సెన్స్ అవార్డు ప్రదానోత్సవం కార్యక్రమం నిర్వహింఆచరు. నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు ముఖ్యఅతిథిగా హాజరై అవార్డుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ర్యాంకులు సాధించిన ఇంటర్ పూర్తియిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని, ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. అతిథులు డిఐఈఓ రఘురాజ్, డాక్టర్ రాంమోహన్ రెడ్డి, డాక్టర్ బిలోజి నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల సాధారణ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫలితాలు సాధించడం అభినందనీయమని అన్నారు. అనంతరం టివియువి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్ సింగ్ మాట్లాడుతూ.. అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఈ అకాడమీ ఎక్సెన్స్ అవార్డు నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన విద్యార్థులకు మెమోంటోలు అందించి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇందూర్ యువత అసోసియేషన్ అధ్యక్షుడు సాయి, టివియువి జిల్లా కన్వీనర్ అజయ్, నవీన్, సుభాష్, సందీప్ , విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకరికి నాలుగేళ్ళ కఠిన జైలుశిక్ష

హత్యాయత్నం కేసులో..

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఒక వ్యక్తిపై హత్యాయత్నం చేసిన ముద్దాయి సయ్యద్ ఇక్రముద్దీన్‌కు నాలుగేళ్ళ కఠిన కారాగార శిక్ష విధిస్తు నిజామాబాద్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శ్రీకాంత్‌బాబు శుక్రవారం తీర్పు చెప్పారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మి నర్సయ్య వివరాల ప్రకారం... నిజామాబాద్ నగరంలోని హస్మి కాలోనికి చెందిన సయ్యద్ ఇక్రముద్దీన్ మద్యం సేవిద్దామని రైల్వే స్టేషన్ దగ్గర గల టానిక్ వైన్స్ పర్మిట్ రూమ్ లోకి వెళ్ళాడు. అప్పటికే అక్కడ మద్యం సేవిస్తున్న బాలాజీ సంగ్రామ్, షేక్ ఆమేర్‌లను మద్యం పోయమని అడిగాడు. మాకే సరిపోదు నువ్వెవరు మమ్మల్ని అడుగుతున్నావు అని ప్రశ్నించడంతో చంపివేయాలనే ఉద్దేశ్యంతో తన జేబులోంచి బ్లేడ్ తీసి ఆమేర్‌పై దాడిచేసి గొంతుపై కోసి తీవ్రంగా గాయపరచడనే అభియోగం కోర్టు నేర న్యాయ విచారణలో రుజువయ్యాయి. దీంతో ఇక్రముద్దీన్‌కు నాలుగు సంవత్సరాల కఠిన జైలుశిక్ష తో పాటు వేయి రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని ఎడల అదనంగా రెండు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని జడ్జి శ్రీకాంత్ బాబు తమ తీర్పులో పేర్కొన్నారు.

వ్యాపారంలో వృద్ధి సాధించాలి

- జెడ్పీటీసి బాజిరెడ్డి జగన్ మోహన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి


దుకాణ సముదాయాన్ని ప్రారంభిస్తున్న జగన్

ఇందల్‌వాయి మండలకేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామపంచాయతీ సమీపంలోగల మణికంఠ ట్రేడర్స్ దుకాణా సముదాయాన్ని శుక్రవారం జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యులు, ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షులు దర్పల్లి జెడ్పీటిసి బాజిరెడ్డి జగన్ మోహన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధి సాధించుకుంటూ వినియోగదారులకు అన్ని వస్తువులు అందుబాటులో ఉండేవిధంగా చుడాలని సూచించారు. మణికంఠ ట్రేడర్స్‌లో ఐరన్, ప్లైవుడ్, రేకులు, పైపులు, పెయింట్స్ ఇతర వస్తువులు మండల కేంద్రంలోనే లభ్యమవడంతో జిల్లా కేంద్రానికి వేళ్ళే అవసరం లేకుండా ఉంటుందని, సమయం కుడా వృథా కాదని అన్నారు. అనంతరం యజమాని గంగాప్రసాద్ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, సర్పంచ్ల పోరం మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ,బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు బిరీష్ శెట్టి, సర్పంచ్లు తెలు విజయ్ కుమార్, నరేష్, ఎంపీటీసీలు చింతల దాస్, కచ్చకాయల అశ్విని శ్రీనివాస్, మారంపల్లి సుధాకర్, సామాజిక కార్యకర్త పులి సాగర్, సీనియర్ నాయకులు పాశం కుమార్, అరటి రఘు, పరుశు రాం, వెంకటేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 7న చలో కలెక్టరేట్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను ఆగస్టు 7న చలో కలెక్టరేట్ కార్యక్రమం ఉంటుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం అన్నారు. అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) నిజామాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో రెండు రోజుల నుండి జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్స్, గురుకుల, కస్తూర్బా, ప్రభుత్వ స్కూల్స్‌లో సమస్యల పైన సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్వే అనంతరం సమస్యల పరిష్కారంకోసం ఆగస్టు 7న ప్రభుత్వ స్కూల్, జూనియర్ కాలేజి, గురుకుల విద్యార్థులు దాదాపు 2వేల మందితో చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడతామని అన్నారు.

మద్దతు తెలపాలంటూ యువకుల ర్యాలీ

నవతెలంగాణ-ముప్కాల్

గురువారం రాత్రి మండలంలోని వేంపల్లి గ్రామంలో యువజన సంఘం ఆధ్వర్యంలో దేశ సమగ్రత కోసం కేంద్ర ప్రభుత్వం తెస్తున్న 'యూసీసీ' యూనిఫామ్ సివిల్ కోడ్ (ఒక దేశం–ఒకే చట్టం)కు మద్దతు తెలపాలంటూ గ్రామంలో యువకులు ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రామంలో ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యువజన సంఘాల నాయకులు ఏట్టం మహేష్ యాదవ్, బి.నరేష్, పరమేశ్వర్, బి. శ్రీనివాస్, మనోజ్, అనిల్, సుమన్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

కోటి 50 లక్షల ప్రొసీడింగ్ కాపీల అందజేత

నవతెలంగాణ-ముప్కాల్


ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తున్న మంత్రి వేముల

మండల కేంద్రంతో పాటు మండలంలోని నాగంపేట్, కొత్తపల్లి, వేంపల్లి, నల్లూర్ గ్రామాల్లోని వివిధ కుల సంఘాలకు విడుదలైన కోటీ 50 లక్షల రూపాయల నిధుల కేటాయింపు ప్రొసీడింగ్ కాపీలను మంత్రి ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం వేల్పూర్‌లోని ఆయన నివాసంలో లబ్దిదారులకు అందజేశారు. మండల కేంద్రానికి చెందిన మున్నూరు కాపు సంఘం కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం కోసం రూ.6 లక్షలు, నాగంపేట్ గ్రామంలో గురడి రెడ్డి కాపు సంఘం కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం కోసం రూ.6 లక్షల రూపాయలను మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మంజూరు చేశారు. వేంపల్లి గ్రామంలో మున్నూరు కాపు సంఘాలు నాలుగు వర్గాల వారికి, ఆదివాసీ నాయకపోడ్ సంఘంకు రూ.3.50 లక్షలు, నల్లూర్ గ్రామంలో గంగపుత్ర సంఘంకు రూ.5 లక్షల రూపాయలు మంజూరు చేశారు. అనంతరం ఆయా సంఘాల పెద్దలు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్ రెడ్డి, బద్దం నర్సారెడ్డి, టౌన్ అధ్యక్షులు పెంటు గంగాధర్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు నాగంపేట్ ముత్తెన్న, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఉమా శంకర్, కుల సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులను వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ అనంత్ రెడ్డి శుక్రవారం అందజేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే చొరవతో మండలంలోని మునిపల్లి గ్రామానికి చెందిన ఆధారి నవీన్‌కు 48వేల రూపాయల చెక్కును, గొల్ల ఎర్రన్నకు 15వేల రూపాయల చెక్కును, శ్రీనివాస్‌కు 16వేల రూపాయల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు పొగుల భాస్కర్, బీఆర్ఎస్ యూత్ నాయకులు క్యాతం రాజారెడ్డి, బద్ధం గంగారెడ్డి పాల్గొన్నారు.